

సీసీసీ నస్పూర్‌లో నినాదాలు చేస్తున్న మంచిర్యాల ఎమ్మెల్యే అభ్యర్థి దివాకర్‌రావు, నాయకులు



మంచిర్యాల బైక్‌ర్యాలీలో పాల్గొన్న బీఆర్ఎస్ కార్యకర్తలు



సిర్పూర్(టి) మండలకేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్న హడ్కులీ, జక్కాపూర్ యువకులతో కోనప్ప



మందమర్రిలో నిర్వహించిన బైక్ ర్యాలీలో చెన్నూర్ బీఆర్ఎస్ అభ్యర్థి బాల్క సుమన్



ఆసిఫాబాద్ నియోజకవర్గంలో మహిళలను ఓట్లు అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మి

# గులాబీ గెలుపు ధీమా

- మూడు నెలలుగా ప్రజాక్షేత్రంలోనే ఉంటూ ఓట్ల అభ్యర్థన
- అభివృద్ధి, సంక్షేమ పథకాలే ప్రధాన అస్త్రాలుగా విస్తృత ప్రచారం
- టాప్ గేర్‌లో కారు.. చతికిల పడ్డ ప్రతిపక్షాలు..
- కేసీఆర్ 'ప్రజా ఆశీర్వాద సభ'లకు బ్రహ్మరథం
- మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు రోడ్‌లతో జోష్
- చివరి రోజు హోరెత్తిన ప్రధాన రహదారులు
- ముగిసిన అసెంబ్లీ ఎన్నికల ప్రచారం

## ప్రచారంలో దూసుకెళ్లిన బీఆర్ఎస్ అభ్యర్థులు



మందమర్రి మార్కెట్‌లో మాట్లాడుతున్న చెన్నూర్ బీఆర్ఎస్ అభ్యర్థి, విప్ సుమన్



రామకృష్ణాపూర్ అంగడి బజారుకు ర్యాలీగా వస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి బాల్క సుమన్



కాగజ్‌నగర్ : రోడ్ షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోనప్ప



బెల్లంపల్లి పట్టణంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దుర్గం చిన్నయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్ షోకు తరలివచ్చిన జనం



సిర్పూర్(టి)లోని లక్ష్మీపూర్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోనేరు కోనప్ప



కాసిపేట మండలంలోని దేవాపూర్‌లో ఎమ్మెల్యే అభ్యర్థి చిన్నయ్య భారీ బైక్ ర్యాలీ

మంచిర్యాల, నవంబర్ 28(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : అసెంబ్లీ ఎన్నికల ప్రచారం మంగళవారంతో ముగిసింది. ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యాక అందరి కంటే ముందుగానే అభ్యర్థులను ప్రకటించిన బీఆర్ఎస్ పార్టీ ప్రచారంలో సత్తా చాటింది. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు అభ్యర్థులను ప్రకటించేప్పటికే బీఆర్ఎస్ అభ్యర్థులు ఒక రౌండ్ పూర్తి చేశారు. మంచిర్యాల జిల్లాలోని చెన్నూర్, మంచిర్యాల, బెల్లంపల్లి నియోజకవర్గాల్లో గడిచిన నెల రోజుల్లో ప్రతి ఊరుకు, ప్రతి ఇంటికీ బీఆర్ఎస్ చేరింది. గడిచిన రెండు దఫాల్లో చేసిన అభివృద్ధి పనులు, ఇంటింటికీ అందిన సంక్షేమాన్ని వివరిస్తూ అభ్యర్థులు ప్రచారం సాగించారు. సకేసీఆర్ 'ప్రజా ఆశీర్వాద సభ'లు, మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ సభలు, రోడ్ షోలతో కార్యకర్తలు, నాయకులు, ప్రజల్లో జోష్ నింపారు. దీంతో రెట్టించిన ఉత్సాహంతో ఎన్నికల ప్రచారాన్ని పూర్తి చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ప్రచారం సాగించిన తీరుపై 'నమస్తే తెలంగాణ' ప్రత్యేక కథనం.

### ఇంటింటికీ చేరిన 'మంచి'తనం

మంచిర్యాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దివాకర్‌రావు ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. నిత్యం జనం మధ్య ఉంటూ తనదైన శైలిలో జనం గుండెల్లో ప్రత్యేక ముద్ర వేసుకున్నారు. నిరాడంబరంగా ప్రచారం సాగిస్తూ ప్రతి ఒక్క ఓటరును కలిశారు. సీఎం కేసీఆర్ 'ప్రజా ఆశీర్వాద సభ'తోపాటు మంత్రి కేటీఆర్ రోడ్‌షోలను గ్రాండ్ సక్సెస్ చేసి తనకు సాటి లేదని నిరూపించారు. సీఎం కేసీఆర్‌తో మంచిర్యాల పట్టణంలో గోదావరి పరీవాహక ప్రాంతాల్లో కరకట్టల నిర్మాణంపై స్పష్టమైన హామీ ఇప్పించి తనకు తిరుగులేకుండా చేసుకున్నారు. దాదాపు గడిచిన పదేళ్లలో నియోజకవర్గానికి చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ, సమస్యలను పరిష్కరించిన తీరును చెప్పుకుంటూ.. ఏ కష్టం వచ్చినా, ఏ ఆపద వచ్చినా అందరి కంటే తానే ముందుటాననే సంక్షేతాన్ని ప్రజల్లోకి చొచ్చుకపోయేలా చేశారు. మరోసారి దివాకర్‌రావునే గెలిపించుకుంటనే మంచి జరుగుతదనే చర్చ వచ్చేలా చేయడంతో విజయం సాధించారు. ఇక మిగిలిన ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలు అడపాదడపా ప్రచారాలే తప్ప ఇంటింటికీ తిరిగి ఓట్లు అభ్యర్థించిన దాఖలాలు తక్కువ. ప్రజలతో మీటింగ్‌లు పెట్టడం, అసంతృప్తులను బుజ్జగించడంలోనే ఆ పార్టీలు ఎన్నికల ప్రచారాన్ని ముగించాయి. కాంగ్రెస్ పార్టీకి సంబంధించి ఏ ఒక్క పెద్ద లీడర్ కూడా ఇక్కడ సభలు, సమావేశాలు పెట్టలేదు. బీజేపీ నుంచి అమిత్‌షా వచ్చినా లోకల్ ఇష్యూస్‌ను అడ్రస్ చేయడంలో విఫలమయ్యారు. దీంతో ఆ రెండు పార్టీలు ప్రచారంలో చతికిలపడిపోయాయి.

### మది గెలిచిన చిన్నయ్య

బెల్లంపల్లి నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దుర్గం చిన్నయ్య జనం మది గెలిచారు. నిత్యం స్థానికంగా అందుబాటులో ఉంటూ సమస్య ఉందని వచ్చిన ప్రతి ఒక్కరినీ ప్రేమతో పలకరిస్తూ పనులు చేసే పెట్టే ఆయన ప్రచారంలోనూ అదే పంథాలో కదం తొక్కారు. నియోజకవర్గంలోని మారుమూల గ్రామాలను చేరుకొని, ప్రజలను ఓట్లు అభ్యర్థించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే అతిపెద్ద సక్సెక్ సభగా నిర్వహించి, ఎన్నికల్లో తన గెలుపు ఖాయమంటూ సంకేతాలు ఇచ్చారు. సీఎం నోట ఇంజినీరింగ్ కాలేజీ, రెసిడెన్షియల్ స్కూళ్ల హామీతోపాటు సింగరేణి, ప్రభుత్వ భూముల్లో ఇండ్లు, వ్యాపారాలు చేసుకుంటున్న వారికి పట్టాల పంపిణీ విషయంపై ప్రకటనలు చేయించి.. బెల్లంపల్లి పట్టణ ప్రజల్లో క్రేజ్‌ను సంపాదించారు. బెల్లంపల్లికి చేసిన అభివృద్ధిని చెప్పుకుంటూ ముందుకు సాగారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ తాను చేసిన పనులు, సంక్షేమాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంలో విజయవంతమయ్యారు. గత పాలకులు ఏం చేయలేదు. బెల్లంపల్లి బాగు పడిందంటే అది చిన్నయ్యతోనే, బీఆర్ఎస్ పార్టీతోనే అనే ముద్ర వేశారు. కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వినోద్ వెంకటస్వామి టికెట్ వచ్చిన పది రోజులు హడావుడి చేసి వదిలేశారు. మండలాల్లో మీటింగ్ పెట్టుకున్నారు తప్పితే ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించడంలో సక్సెక్ కాలేకపోయారు. రేవంత్‌రెడ్డితో మీటింగ్ పెట్టించినా బెల్లంపల్లికి ఏం చేశాం. ఏం చేయబోతున్నామనేది చెప్పించడంలో విఫలమయ్యారు. బీజేపీ అభ్యర్థి శ్రీదేవి అడపాదడపా ప్రచారంతో సరిపెట్టారు తప్పితే పెద్దగా జనంలోకి వెళ్లలేకపోయారు.

### చెన్నూర్‌లో చెరగని ముద్ర

చెన్నూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బాల్క సుమన్ ఎన్నికల ప్రచారంలో అందరికంటే ఒక్క అడుగు ముందున్నారు. ప్రతి గ్రామంలో ఇంటింటికీ తిరిగి ఓట్లు అభ్యర్థించారు. గతంలో చెన్నూర్‌ను పాలించిన పార్టీలు చేయలేక విఫలమైన పనులన్నింటినీ, గడిచిన ఐదేళ్లలో పూర్తి చేసి చూపించిన ఆయన.. అదే ప్రచారాస్త్రంగా ముందుకు సాగారు. బీఆర్ఎస్ కీలక నాయకుల ఇంటి దగ్గర మీటింగ్‌లు, ప్రచారంతో పాటు క్షేత్రస్థాయి కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తూ తనదైన శైలిలో ప్రచారం చేశారు. రెండు, మూడు సార్లు సోషల్ మీడియా వర్క్‌షాప్‌లు కూడా పెట్టి బీఆర్ఎస్ యువతను ఎన్నికల కోసం సంసిద్ధం చేశారు. దీంతో సుమన్ ఎక్కడికి వెళ్లినా జన జాతర కనిపించింది. ఊరూవాడా అనే తేడా లేకుండా ఆయనకు బ్రహ్మరథం పట్టారు. నియోజకవర్గంలో నిర్వహించిన ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ సభలు, రోడ్ షోలు గ్రాండ్ సక్సెస్ అయ్యారు. ప్రతి సభలోనూ సుమన్ కేసీఆర్‌కు ఎంత దగ్గరనే విషయంపై నాయకులు మాట్లాడడం.. ఆయనతోనే చెన్నూర్ బాగు పడిందని, ఇంకా.. అభివృద్ధి జరుగుతుందనే నమ్మకం కల్పించడంలో విజయవంతమయ్యారు. కాంగ్రెస్ అభ్యర్థి వివేక్ వెంకటస్వామి ప్రచారం చేయడంలో పూర్తిగా విఫలమయ్యారు. నాయకుల కొనుగోలులోనే ఆయన బిజీగా గడపడం, మొన్నటి వరకు వేరే పార్టీలో ఉన్న నాయకులను కాంగ్రెస్‌లో చేర్చుకొని విమర్శల పాలయ్యారు. హైదరాబాద్ నుంచి ఎన్నికల్లో పంచేందుకు తెస్తున్న డబ్బు దొరకడం, ఐటీ రైడ్ జరిగి ఆయన చేసిన అక్రమాలు బయటపడడంతో ప్రజల్లో ఉన్న కొద్ది పాటి విశ్వాసాన్ని కోల్పోయారు. ఇక్కడ మరే పార్టీ చెప్పుకోదగిన స్థాయిలో ప్రచారం నిర్వహించలేకపోయాయి.

### చివరి రోజు.. హోరెత్తించారు..

ప్రచారానికి చివరిరోజైన మంగళవారం ముగ్గురు అభ్యర్థులు ఎన్నికల ప్రచారాన్ని హోరెత్తించారు. మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు నస్పూర్, శ్రీరాంపూర్, మంచిర్యాల, హాజీపూర్, లక్షెట్టిపేటతోపాటు దండేపల్లిలో భారీ ర్యాలీలు నిర్వహించారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య బెల్లంపల్లి పట్టణంలో భారీ బైక్ ర్యాలీ తీశారు. కాసిపేట మండల ప్రచారంలో పాల్గొన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి ఎంపీ వెంకటేశ్ నేతకానితోపాటు ఆయన సతీమణి జయతార తాండూర్‌లో, పార్టీ నాయకులు, కార్యకర్తలు మిగిలిన మండలాలు, గ్రామాల్లో విస్తృత ప్రచారం చేశారు. చెన్నూర్‌లో ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బాల్క సుమన్ చివరి రోజు ప్రచారంలో భాగంగా రామకృష్ణాపూర్, మందమర్రితోపాటు వివిధ మండల కేంద్రాల్లో సమావేశాలు నిర్వహించారు. కార్యకర్తలు, నాయకులతో ప్రచారాలు చేయించారు. మొత్తానికి ఈ మూడు నియోజకవర్గాల్లో వందకు వంద శాతం ప్రచారం నిర్వహించడంలో బీఆర్ఎస్ అభ్యర్థులు విజయవంతమయ్యారు.

### కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో దూకుడు


కుమ్రం భీం ఆసిఫాబాద్, నవంబర్ 28(నమస్తే తెలంగాణ) : అసెంబ్లీ ఎన్నికల ప్రచార ఘట్టం మంగళవారం సాయంత్రంతో ముగిసింది. ప్రకటన నుంచి బీఆర్ఎస్ అభ్యర్థులు క్షేత్రస్థాయిలో జోరుగా ప్రచారం నిర్వహించారు. ప్రచారం చివరి రోజైన మంగళవారం సిర్పూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి కోనేరు కోనప్ప కాగజ్‌నగర్ పట్టణంలో వేలాది మంది మోటర్ సైకిళ్లతో భారీ ర్యాలీ తీశారు. అభిమానులు, కార్యకర్తలు, నాయకులు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. దాదాపు ఏడు కిలోమీటర్లు మోటార్ సైకిళ్లతో కాగజ్‌నగర్ పట్టణం కిటకిటలాంది. కోనేరు కోనప్ప ప్రత్యేక వాహనంలో ప్రజలకు అభివాదం చేస్తూ ప్రచారం నిర్వహించారు. ఆసిఫాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మి మండలంలోని వివిధ గ్రామాలతోపాటు జిల్లా కేంద్రంలో పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపునకు సీఎం కేసీఆర్ కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ నియోజవర్గాల్లో నిర్వహించిన 'ప్రజా ఆశీర్వాద సభ'ల్లో పాల్గొని బీఆర్ఎస్ పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని, ఊపుని నింపారు. బీఆర్ఎస్ అభ్యర్థులు ఏ గ్రామంలో ప్రచారానికి వెళ్లినా ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించింది. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం ఖాయమని తెలుస్తోంది. సిర్పూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు నిరంతరం పర్యటిస్తూ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ప్రభుత్వం పదేళ్ల కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ, మళ్లీ అధికారంలోకి వస్తే చేపట్టబోయే అభివృద్ధిని, ఎన్నికల మ్యానిఫెస్టోని వివరించారు. ప్రజల నుంచి భారీ స్పందన లభించడంతో ఈనెల 30న నిర్వహించనున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం ఖాయమని అధికార పార్టీ అభ్యర్థులు ధీమాతో ఉన్నారు.



బెల్లంపల్లి పట్టణంలోని రోడ్ షోలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చిన్నయ్య



వాంకిడి : ఎమ్మెల్యే అభ్యర్థి కోవలక్ష్మికి స్వాగతం పలుకుతున్న మహిళలు



విలేజీనస్పూర్‌లో మాట్లాడుతున్న మంచిర్యాల ఎమ్మెల్యే అభ్యర్థి దివాకర్‌రావు



ఆసిఫాబాద్ నియోజకవర్గంలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మి